

డిసిహెచ్‌ఎస్‌గా నాగభూషణరావు



ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

జిల్లా కేంద్ర ఆసుపత్రి సమన్వయకర్త గా పాలకొండ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గొర్లి నాగభూషణ రావు బాధ్యతలు స్వీకరించునున్నారు. ఈ మేరకు మంగళవారం అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం సమన్వయకర్తగా వ్యవహరిస్తున్న డాక్టర్ వాగ్దేవి బాధ్యతలు నిర్వహించడానికి విముఖత చూపించడంతో నాగభూషణరావును డిసిహెచ్‌ఎస్‌గా నియమిస్తున్నట్లు విజయనగరం జిల్లా సమన్వయకర్త కార్యాలయం ఉత్తర్వులు విడుదల చేసింది.



జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అచ్చెన్న జాడేదీ?

- ఒకసారి మాత్రమే ముఖం చూపించిన కింజరాపు
- జిల్లాలో పేరుకుపోతున్న సమస్యలు
- ఏళ్లతరబడి కానరాని ఐటిడిఎ పాలకవర్గ సమావేశాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా ఇంఛార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జాడ కనిపించడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇంఛార్జి మంత్రి గా నియామక మైన తర్వాత ఆయన ఒకసారి మాత్రమే జిల్లాకు వచ్చి ముఖం చూపించారు.ఆయనతోపాటు నియామకమైన పక్క జిల్లా ఇంఛార్జి మంత్రులు నెలకో, రెండు నెలలకో వచ్చి అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. అధికారులతో సమావేశాలు నిర్వహించి జిల్లాలో వున్న ప్రధాన సమస్యలు పరిష్కారానికి చొరవ చూపిస్తున్నారు. జిల్లాకు చెందిన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి పాడేరు జిల్లా ఇంఛార్జి మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అనేకసార్లు ఆ జిల్లాకు వెళ్లి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. విజయనగరం జిల్లా ఇంఛార్జి మంత్రి వి.అనిత కూడా దఫదఫాలుగా విజయనగరం జిల్లాకు వచ్చి సమావేశాలు నిర్వహిస్తున్నారు. జిల్లా ఇంఛార్జి మంత్రుల పాత్ర జిల్లాల అభివృద్ధిలో చాలా కీలకమైనది. జిల్లాలో ఏ అభివద్ధి పనులకు నిధులు మంజూరు కావాలన్నా, సమస్యలు పరిష్కారం చేయాలన్నా ఇంఛార్జి మంత్రి అనుమతి కావాల్సి ఉంది. ఆయన అనుమతి లేనిదే ఏ ఫైలూ ప్రభుత్వానికి చేరే పరిస్థితి లేదు. ఇలాంటి కీలకమైన ఇంఛార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జిల్లాకు రాకపోవడం వెనుక ఆంతర్యమేమిటనే చర్చ జరుగుతోంది. జిల్లా ఇంఛార్జి మంత్రి గా అచ్చెన్నాయుడు నియామకాన్ని జీర్ణించుకోలేని అధికారపార్టీ ఎమ్మెల్యేలు మన్యం జిల్లాకు ఆయన రాకుండా ఉంటే మంచిదన్న అభిప్రాయంతో ఉన్నారు. ఇలాంటి పరిణామాల నేపథ్యంలో జిల్లాలో ఇంఛార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రాబల్యం పెరగకుండా ఆయన వ్యతిరేక శక్తులేమైనా పని చేస్తున్నాయేమోనన్న చర్చ నడుస్తోంది. అందుకే ఆయన జిల్లా వైపు తొంగి చూడడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

కానరాని ఐటిడిఎ పాలకవర్గ సమావేశాలు

టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంతవరకు ఐటిడిఎ పాలకవర్గ సమావేశాలు నిర్వహించలేదు. గత ప్రభుత్వం హయాంలో ఒకేసారి పార్వతీపురం ఐటిడిఎ పాలకవర్గ సమావేశం జరిగింది. జిల్లాలో ఏజెన్సీ గ్రామాల సమస్యలు కోకొల్లలు గా వున్నాయి. విద్యుత్, సాగునీటి, తాగునీటి సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. పూర్ణపాడు లాబేసు వంతెన, జంఝావతి ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు లేవు.జిల్లా వ్యవసాయ ప్రధానమైనది కావడంతో అందుబాటులో ఉన్న సాగునీటి వనరుల అభివృద్ధి కి చర్యలు తీసుకోవాల్సి ఉంది. జిల్లా ఏర్పడి మూడేళ్ళు దాటినా పూర్తి స్థాయిలో అధికారుల నియామకం లేదు. ఇంఛార్జి అధికారులతోనే పరిపాలన సాగుతోంది. రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో జవాబుదారీతనం కొరవడుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఇంఛార్జి మంత్రి గా అచ్చెన్నాయుడు జిల్లా ప్రగతిలో కీలక పాత్ర పోషించాల్సి వుంటుంది.

టిడిపి కేడర్ లోనూ నిర్లిప్తత

టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఆపార్టీకి చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలలో కొంత నిర్లిప్తత నెలకొంది. పార్టీ ఆవిర్భావం నుంచి పని చేస్తున్న నాయకులు, కార్యకర్తలకు నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదన్న చర్చ జరుగుతోంది. దీంతో నాలుగు నియోజకవర్గాల్లోనూ గ్రూపు రాజకీయాలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఇంఛార్జి మంత్రిగా అచ్చెన్నాయుడు రావడంపై అసంతప్తి నాయకులు కొంత ఆనందం వ్యక్తం చేశారు. తమ కష్టాలు చెప్పుకోడానికి తగిన నాయకుడు ఇంఛార్జి మంత్రి రూపంలో దొరికారని సంబరపడ్డారు. అచ్చెన్నాయుడుకి గతంలో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు గా పని చేసిన అనుభవం వుంది. అన్ని నియోజకవర్గాల్లో స్థానిక పరిస్థితులపై అవగాహన వుంది. జిల్లాకు తరచూ ఆయన వస్తే తాము ఎదుర్కొంటున్న సమస్యల్ని చెప్పుకోవచ్చు నని అసంతప్తి నాయకులు, కార్యకర్తలు ఎదురు చూస్తున్నారు. ఆయన రాక ఆలస్యం కావడంతో పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తల్లో నిరుత్సాహం నెలకొంది.

మన్యంలో భానుడు ఉగ్రరూపం

- బెంబేలెత్తిస్తున్న ఎండలు.. అల్లాడిపోతున్న ప్రజలు
- ఉక్క పోతతో ఉక్కిరిబిక్కిరి
- 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

ప్రజాశక్తి - కురుపాం

మన్యంలో భానుడు భగభగలాడుతూ ఉగ్రరూపం దాల్చుడు. మంగళవారం మన్యంలో అత్యధికంగా 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వేసవి తాపానికి ప్రజలు అల్లాడుతున్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. మే రెండో వారంలోనే భగభగలాడుతున్న సూర్యుడు తన ప్రతాపాన్ని పెంచేశాడు. గత వారం రోజుల నుంచి ఎండ తీవ్రరూపం దాల్చింది. పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మన్యం జిల్లాలో గతేడాది ఇదే సమయానికి పగటి పూట అత్యధికంగా 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, ఈ ఏడాది 40 డిగ్రీలకు చేరుకుంది. అలాగే నియోజకవర్గం పరిధిలోని గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలసలో 39 డిగ్రీలు నమోదు కాగా, గిరిజన గ్రామాల్లో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అత్యధిక ఉష్ణోగ్రతల వల్ల ఎండ సెగ తీవ్ర స్థాయిలో కనిపించింది. ఎండ ధాటికి తట్టుకోలేక మధ్యాహ్నం పూట రోడ్ల మీద జన సంచారం పలుచబడింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ రోడ్ల మీద జనం చాలా తక్కువగా కనిపించారు. అత్యవసర పనుల విషయంలో మినహాయించి మిగతా సందర్భాల్లో రోడ్ల మీదకు వచ్చేందుకు జనం జంకే పరిస్థితి ఏర్పడింది. నియోజకవర్గ కేంద్రమైన కురుపాంలో మధ్యాహ్నం పూట రోడ్లు నిర్మానుష్యంగా కనిపించాయి.

ఎక్కువ ప్రమాదం ఎవరికంటే

ఎండ సమయంలో బయట ఎక్కువగా తిరగడం వల్ల పిల్లల్లో ఎక్కువగా వడదెబ్బ తగిలే అవకాశం ఉందని వైద్యులు అంటున్నారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు,



ఎండ వేడికి నిర్మానుష్యంగా ఉన్న కురుపాం ప్రధాన రహదారి

క్రీడాకారులు, బాలింతలపై ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. దీర్ఘకాలిక వ్యాధులు, స్థూలకాయం ఉన్న వారు, మద్యం ఎక్కువగా తీసుకునే వారు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

జాగ్రత్తలు తప్పవంటున్న నిపుణులు

ప్రజలు బయటకు తిరిగిన సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు, వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వడదెబ్బ వంటివి తగలకుండా నీటిని ఎక్కువగా తీసుకుంటూ సాధ్యమైనంత వరకు నీడలో ఉండాలని సూచిస్తున్నారు. వడదెబ్బ తగిలిన తర్వాత మళ్లీ ఎండలోకి వెళ్లకూడదని, చల్లని నీడలో విశ్రాంతి తీసుకోవాలని అంటున్నారు. బయట తిరిగే సమయంలో తలకు టోపీ పెట్టుకోవాలని, గొడుగు వాడాలని, రోజుకు ఐదు లీటర్లకు తగ్గకుండా నీరు తాగాలని, సమయానికి ఆహారం తీసుకోవాలని, ఉప్పు కలిపిన ద్రావాలు తాగాలని, శరీరంలో నీటి శాతాన్ని పెంచుకునేందుకు పుచ్చకాయ, కొబ్బరి నీళ్ల తాగాలని, వదులైన కాటన్ దుస్తులు ధరించాలని సూచిస్తున్నారు.



ఆసుపత్రిలో రక్త నిల్వల గురించి సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

రక్త నిల్వలు పెంచాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

రక్త హీనత నివారణకు, ప్రాణాపాయ సమయాల్లో రక్తాన్ని అందించేందుకు రక్త నిల్వలు పెంచాల్సిన ఆవశ్యకత ఉందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. స్థానిక జిల్లా ఆసుపత్రిని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సేవలకు ఇబ్బంది కలగకుండా సాధారణ పౌరునిగా వెళ్లి ఆసుపత్రిలో అందుతున్న సేవలను నిశితంగా పరిశీలించారు. ఆసుపత్రికి కలెక్టర్ వచ్చారని తెలియడంతో వైద్య సిబ్బంది, రోగులు అవాక్కయ్యారు. ఆసుపత్రిలోని జనరల్ వార్డ్, బ్లడ్ బ్యాంక్ (రక్త నిధి), సదరం, కంటి తనిఖీ కేంద్రం, స్త్రీ ప్రసూతి విభాగం, దంత వైద్య విభాగం, ఒపితో పాటు ప్రతి విభాగాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అత్యవసర కేసుల వివరాలు, ఎక్కువగా ఏ కేసులు వస్తున్నవి అన్న వివరాలను వైద్యులను ప్రశ్నించారు. అనీమియా, అత్యవసర కేసులు వస్తున్నట్లు వైద్యులు తెలపగా రక్త దాన శిబిరాలు నిర్వహించి రక్త నిల్వలు పెంచాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. రక్త నిల్వల (రక్త నిధి) పరికరాలను పరిశీలించి నిత్యం పరిశుభ్రంగా ఉండేలా నిర్వహణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఆసుపత్రిలో కల్పించిన వసతుల వినియోగంలో ఉండాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. రోగులకు అందిస్తున్న భోజన వంటకాలను పరిశీలించారు. రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆసుపత్రి వాతావరణం ఉండాలని లేనిపక్షంలో సహించేది లేదని హెచ్చరించారు. ఆసుపత్రి సందర్శన అనంతరం అందుతున్న వైద్య సేవలపై సంతప్తి వ్యక్తంచేశారు.

కార్యక్రమంలో సూపరింటెండెంట్ నాగ శివ జ్యోతి, ఆసుపత్రి వైద్యులు బి.వాగ్దేవి, ఎపిఎంఐడిసి ఇంజినీరింగ్ అధికారి బి.ప్రసన్న కుమార్, వివిధ విభాగాల వైద్యులు సీతారామ రాజు, శ్రీధర్, వెంకటరమణ, దినేష్ కుమార్, కమల కుమారి, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డిప్లమో కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - పార్వతీపురం

తిరుపతి జిల్లా వెంకటగిరిలో గల శ్రీ ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (SPKM IIHT)లో మూడేళ్ల హ్యాండ్లూమ్ అండ్ టెక్స్ టైల్ టెక్నాలజీ డిప్లొమ కోర్సులో ప్రవేశం కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓఎస్డి ఎస్.గిరిధరరావు మంగళ వారం ఆయన ఒక ప్రకటన తెలిపారు. SPKM IIHTలో 53 సీట్లకు, తమిళనాడులోని సేలం నందు 12 సీట్లకు, కర్ణాటకలోని గడగ్‌లో 4 సీట్లకు దరఖాస్తులను కోరుతున్నట్లు చెప్పారు. 10వ తరగతి, తత్సమానమైన పరీక్షలో ఉత్తీర్ణులై, జూలై 1 నాటికి బిసి, జనరల్ కేటగిరీలకు 15 - 23 ఏళ్ల, ఎస్సీ, ఎస్టీ కులాల వారికి 25 ఏళ్ల వయసు గల వారు అర్హులని తెలిపారు. మూడేళ్ల డిహెచ్‌టిటి కోర్సులో ఇంటర్ ఎంపిసి, ఒకేషనల్ (టెక్స్ టైల్స్), ఐటిఐ (2 సం.లు) కోర్సుల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు నేరుగా DHTT రెండో సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు జూన్ 1 లోగా దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలు, దరఖాస్తు పొందేందుకు www.iihtvgr.com వెబ్సైట్‌ను, 08625-295003, 93999 36872, 98661 69908, 90102 43054 నెంబర్లను సంప్రదించవచ్చని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

మూడో శనివారం స్వర్ణాంధ్రా - స్వచ్ఛాంధ్రా

ప్రజాశక్తి - పార్వతీపురం

వచ్చే మూడో శనివారం స్వర్ణ ఆంధ్రా - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం జిల్లాలో పెద్ద ఎత్తున చేపట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వేసవి వడగాలుల దృష్ట్యా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలపై ప్రజలకు పెద్దఎత్తున అవగాహన కల్పించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వచ్చే మూడో శనివారం స్వచ్ఛ కార్యక్రమంలో భాగంగా "బీట్ ద హీట్" థీమ్ తో వేసవి దృష్ట్యా వడ గాల్పుల బారిన పడకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలు ప్రజలకు వివరించాలన్నారు. వడ గాల్పుల వల్ల ఏ ఒక్కరూ అనారోగ్యం బారిన పడకూడదని స్పష్టం చేశారు. గ్రామాల్లో స్వయం సహాయక సంఘాల మహిళలు, ఉపాధి హామీ వేతనదారులు, గ్రామపంచాయతీల పారిశుధ్య కార్మికులు తదితరులతో సమావేశం నిర్వహించి వారికి వేసవి దృష్ట్యా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు వివరించాలన్నారు. వారు చేయాల్సిన పనులు చేయకూడని పనులు ఏమిటో స్పష్టంగా తెలియజేయాలన్నారు. పిల్లలు, వయోవృద్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అన్ని గ్రామాలు, పట్టణాల్లోనూ ముఖ్యమైన ప్రదేశాల్లో చలివేంద్రాలను నిరంతరం నడపాలన్నారు.

వాతావరణ హెచ్చరికలు పట్ల అప్రమత్తంగా ఉండాలి

వాతావరణ హెచ్చరికల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ ప్రకటించిందని, రెవెన్యూ, సంబంధిత అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాలని ఆయన ఆదేశించారు. వేసవి తీవ్రత, అకాల వర్షాలు, ఈదురు గాలుల పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలని ఆయన చెప్పారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జెసి శోభిక

ప్రజల అవగాహనకు మాక్ డ్రిల్

ప్రజాశక్తి - పార్వతీపురం

అత్యవసర పరిస్థితుల్లో పౌరుల సురక్షిత, సంసిద్ధతకు మాక్ డ్రిల్‌ను బుధవారం నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక తెలిపారు. మాక్ డ్రిల్ సన్నాహక చర్యలపై మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. బుధవారం ఉదయం 9 గంటలకు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో భద్రతా మాక్ డ్రిల్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మాక్ డ్రిల్‌లో భాగంగా వైమానిక దాడులతో సహా ఇతర అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఎలా ప్రతిస్పందించాలో తెలపడంతో పాటు స్వీయరక్షణపై ప్రజలు, విద్యార్థులకు అవగాహన పెంపొందించాలని ఆమె సూచించారు. భద్రతా మాక్ డ్రిల్ కు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఫైర్ సర్వీసెస్, రెవిన్యూ, పోలీసు, వైద్య ఆరోగ్యశాఖ, మున్సిపల్ కమీషనరు, ఎన్ సిసి కో-ఆర్డినేటర్, రైల్వే, ఎపిఇపిడిసిఎల్, ఆర్ టిసి, తదితర శాఖల అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. మాక్ డ్రిల్ నిర్వహించే సమయంలో సైరన్ మోగించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. మాక్ డ్రిల్ పట్ల ప్రజలకు ముందుగా తెలియజేసి భయభ్రాంతులకు లోనుకాకుండా చేయాలని ఆమె స్పష్టం చేశారు. జిల్లా ముఖ్య అగ్నిమాపక అధికారి కె.శ్రీనుబాబు మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ముఖ్యంగా అణుబాంబు వంటి దాడి సమయంలో పౌరులు తీసుకోవాల్సిన సురక్షిత చర్యల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. అణుబాంబు విస్ఫోటన జరిగితే మూడు నుంచి 5 కిలో మీటర్ల మేర తీవ్ర ప్రభావం ఉంటుందని చెప్పారు. అటువంటి సమయంలో దట్టమైన గోడలు గల ఇళ్లలో ఉండడం వల్ల రేడియేషన్ ఉండకుండా సురక్షితంగా ఉండేందుకు అవకాశం ఉందని వివరించారు. భూగర్భ నీటిపారుదల వ్యవస్థలు (అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థ) వంటి వాటిని సైతం ఉపయోగించుకుని సురక్షితంగా ఉండవచ్చని తెలిపారు. ఆసుపత్రులు వంటి అత్యవసర వైద్య సేవలు గల సంస్థలు విద్యుత్ కాంతుల బయటకు రాకుండా తగిన కర్టెన్ లను వేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 15 నిమిషాల కంటే ఎక్కువ సమయం సైరన్ మోగితే పరిస్థితిలో తీవ్రత ఉందని గ్రహించాలని, అందుకు తగిన విధంగా సురక్షిత చర్యలు తీసుకోవడం, అధికార యంత్రాంగంతో సహకరించడం చేయాలని ఆయన అన్నారు.

సమావేశంలో డిఆర్ఒ కె.హేమలత, కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి ధర్మచంద్రా రెడ్డి, ఇపిడిసిఎల్ పర్యవేక్షక ఇంజనీర్ కె.చలపతిరావు, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ టి.జగన్మోహనరావు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఐ.రాజేశ్వరి, ఎంవిఐ ఎం.శశికుమార్, డిఎస్‌పి థామస్ రెడ్డి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిబంధనలకు పాతర

- సురేష్, భాష్యం పాఠశాలలకు అనుమతులు లేవు
- కనీస వసతులూ కరువే

ప్రజాశక్తి పాలకొండ

ప్రైవేట్ విద్యా సంస్థల్లో నిబంధనలకు పాతర వేస్తున్నాయి. విద్యార్థులకు కనీస అనుమతుల్లేకుండా, సౌకర్యాలు కూడా కల్పించకుండా ప్రైవేట్ పాఠశాల నిర్వహణ కొనసాగుతుందని పలు విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టించుకోవాల్సిన అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారంటూ సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాఠశాల నిర్వహణకు ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా అమలు చేయాల్సి ఉన్నప్పటికీ ఎక్కడా అమలు చేసిన దాఖలాల్లేవు. సరైన మైదానం, 20 మంది విద్యార్థులకు ఒక మరుగుదొడ్డి, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా పాఠశాల ఉండాల్సి ఉన్నా ఇవి ప్రైవేట్ పాఠశాలల్లో ఎక్కడా కానరావడంలేదు. వేలాది రూపాయలు విద్యార్థి నుంచి ఫీజులు గుంజుతున్నప్పటికీ వసతులు కల్పించడంలో మాత్రం నిర్లక్ష్యం చూపుతున్నారు. మండల కేంద్రమైన పాలకొండలో భాష్యం, సురేష్ స్కూళ్లకు అస్సలు ప్రభుత్వ అనుమతులే లేవు. సురేష్ స్కూలుకు పూర్తిస్థాయిలో ఎలాంటి అనుమతులు లేవు. ఇంకా పూర్తిస్థాయిలో అనుమతులు పెండింగ్‌లో ఉన్నప్పటికీ పాఠశాలను యథావిధిగా కొనసాగిస్తున్నట్లు సమాచారం. అనుమతుల్లేకుంటే ఇంత దర్జాగా తరగతులు నిర్వహించడం పట్ల పలు



పూర్తిస్థాయిలో ప్రభుత్వ అనుమతుల్లేని సురేష్ స్కూల్

విమర్శలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా ఈ ఏడాది ఇక్కడ ప్రారంభిస్తున్న భాష్యం స్కూల్‌కు కూడా ఇంతవరకు అనుమతుల్లేనట్టు తెలిసింది. అయినప్పటికీ విద్యార్థులను పాఠశాలలో చేర్చుకోవడానికి వారు సిద్ధమవుతున్నారు. అనుమతులు లేకుండా విద్యార్థులను పాఠశాలలో చేర్పించుకోవడం పట్ల తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు ఉదాసీనతంగా వ్యవహరించడం దర్జాగా అడ్మిషన్లు చేసుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. దీనిపై డిప్యూటీవో పి.కృష్ణమూర్తిని 'ప్రజాశక్తి' వివరణ కోరగా, సురేష్ స్కూల్లో అనుమతులు పెండింగ్లో ఉన్నాయని, భాష్యం స్కూల్ ఇంకా అనుమతులు పొందలేదని చెప్పారు. పాఠశాల నిర్వహణకు ఖచ్చితంగా నిబంధనలు పాటించాల్సి ఉందని తెలిపారు.

ఆరోగ్య సర్వే లక్ష్యాలకు బయోమెట్రిక్ పరికరాలు దోహదం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

సకాలంలో ఆరోగ్య సర్వే లక్ష్యాలు చేరుకోవడంలో బయోమెట్రిక్ పరికరాలను సద్వినియోగం చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు సూచించారు. వైద్యారోగ్యశాఖ జిల్లాకు పంపిణీ చేసిన బయోమెట్రిక్ పరికరాలను మంగళవారం స్థానిక ఆరోగ్య కార్యాలయంలో ఆయన వైద్య సిబ్బందికి అందజేశారు. అనంతరం భాస్కరరావు మాట్లాడుతూ ప్రజారోగ్యం దృష్ట్యా వైద్య సిబ్బంది పలు సర్వేలు చేపడుతున్నారని, ఇందుకు గాను జిల్లాకు 695 బయోమెట్రిక్ పరికరాలను పంపిణీ చేశారని, వీటిని అన్ని ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్య సిబ్బందికి అందజేస్తున్నామని తెలిపారు. ఇంటింటి సర్వేలో, ఆరోగ్య కేంద్రాల్లో ప్రతీ ఒక్కరికీ ఆరోగ్య తనిఖీలు చేపట్టి వివరాలు ఆన్లైన్‌లో నమోదు చేయాల్సి ఉందని అన్నారు. ఎన్సీడీ, ఆర్బిఎస్కె సర్వేలు, ఇహెచ్ఆర్ నమోదుకు ఒటిపి

సిబ్బందికి బయోమెట్రిక్ పరికరాలను అందజేస్తున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు



విధానంలో సిబ్బందికి ఎక్కువ సమయం పడుతుందని, అంతేగాక కొన్ని ప్రాంతాల్లో సిగ్నల్స్ సమస్య, కొంతమందికి ఫోన్లు లేకపోవడం వల్ల వారి ఆరోగ్య వివరాలు నమోదు కొంత క్లిష్టతరంగా ఉండేదని అన్నారు. ఇప్పుడు అందజేసిన బయోమెట్రిక్ పరికరాలతో వేలి ముద్ర సేకరణ ద్వారా సర్వే మరింత సులభమవుతుందని, సకాలంలో లక్ష్యాలు పూర్తి చేయడానికి దోహద పడుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి.జగన్మోహనరావు, డాక్టర్ పిఎల్.రఘుకుమార్,సిడిఎస్ ఫార్మసిస్ట్ లీలారాణి తదితరులు పాల్గొన్నారు.



ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న పిఒ అశుతోష్ శ్రీవాస్తవ

జీడి ప్రాసెసింగ్ యూనిట్ పనుల పర్యవేక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణ పరిధిలోని మార్కెట్ యార్డ్‌లో నిర్మించబోతున్న జీడి ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణ పనులను ఐటిడిఎ పిఒ అశుతోష్‌శ్రీవాస్తవ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు, సిబ్బందికి ఆయన పలు సూచనలు, మార్గదర్శకాలతో దిశా నిర్దేశం చేశారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భనలో గిరిజన సంక్షేమ శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ మణిరాజ్, ఎపిఒ మురళీధర్, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మంచినీటి సరఫరాను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వర్లు

వార్డుల్లో కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని పలు వార్డుల్లో స్థానిక మున్సిపల్ కమిషనర్ సిహెచ్.వెంకటేశ్వర్లు మంగళవారం సుడిగాలి పర్యటన చేశారు. వార్డుల్లో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను, తాగునీరు సరఫరా జరిగే ప్రాంతాల్లోనూ, ప్రధాన పైపులైన్లు లేని ప్రాంతాల్లో మున్సిపల్ ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా జరుగుతున్న తీరును, అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు అల్పాహారం అందజేస్తున్న వైనాన్ని పరిశీలించేందుకు సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పట్టణ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని, దీంతో పాటు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు.



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఈ పోటీలను నిర్వహించినట్లు గ్రంథాలయ నిర్వాహకులు నల్ల మధుసూదనరావు తెలిపారు. ఈ పోటీలకు స్థానిక మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నుంచి జూన్ 6 వరకు వేసవి శిక్షణా శిబిరాన్ని గ్రంథాలయంలో నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు. వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు పుస్తక పఠనం, డ్రాయింగ్, ఆటల పోటీలను ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మధుసూదనరావు కోరారు. కార్యక్రమంలో రావివలస, సంతోషపురం గ్రామాలకు చెందిన బిడిసిలు కొయ్యాన ప్రసాదరావు, దత్తి తేజస్విని, విద్యార్థులు పాల్గొన్నారు.

నడుకూరులో వైద్య శిబిరం

ప్రజాశక్తి -వీరఘట్టం

మండలంలోని నడుకూరులో మంగళవారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, మధుమేహ, రక్తపోటు, జ్వర పీడితులు, తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104సిబ్బంది, గ్రామస్తులు, పాల్గొన్నారు.

వైద్య అధికారిగా సాయికుమార్

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా సాయికుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ వైద్యాధికారిగా విధులు నిర్వహించిన పి.ఉమామహేశ్వరి ఉన్నత చదువుల కొరకు విశాఖ వెళ్లిపోవడంతో ఆమె స్థానంలో సాయికుమార్ బాధ్యతలు స్వీకరించడంతో సాయికుమార్ నియమితులయ్యారు.

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో కిశోర వికాసం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కిశోర వికాసం కార్యక్రమం లో భాగంగా జూన్ 10వరకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సెక్టార్ సూపర్వైజర్ రౌతు లక్ష్మి అన్నారు. కిశోర వికాసం సమ్మర్ క్యాంపులో భాగంగా మంగళవారం గరుగుబిల్లిలో బాలల హక్కులు, రక్షణ,తదితర అంశాలపై కిశోర బాలికలకు తెలియ జేశారు. అనంతరం సూపర్వైజర్ లక్ష్మి మాట్లాడుతూ 11 ఏళ్లు నుంచి 18 ఏళ్ల బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబన మెరుగు కోసమే ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశమని తెలిపారు. కిశోరి వికాసం కార్యక్రమం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని, అలాగే ఉజ్వల ఆరోగ్యకరమైన సాధికార దిశగా వేసే అడుగులకు చేయూతను ఇద్దామని పేర్కొన్నారు. రక్తహీనత నివారణే ధ్యేయంగా గర్భిణీలు, బాలింతలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది బిడ్డిక చిన్నమ్మి, చింతాడ ఉదయకుమారి, మహిళా సంరక్షణ అధికారి గొర్లి భవాని, అంగన్వాడీ వర్కర్లు పల్ల కృష్ణవేణి, మహంతి పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.



గరుగుబిల్లిలో ర్యాలీ చేస్తున్న ఐసిడిఎస్ సిబ్బంది

ఎటు చూసినా గుంతలే...

- ప్రయాణికులకు తప్పని పాట్లు
- పట్టించుకునే నాధుడే లేడు

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలో సాలూరు నుంచి గంగన్నదొరలస మధ్యలో రోడ్డు తప్ప ఏ మూలన ఏ రోడ్డు చూసినా ఎక్కడికక్కడ గుంతలే. ఈ గుంతలు చూసి వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. సాలూరు మండలంలోని మామిడిపల్లి నుండి జిల్లేడు వలసకు వెళ్లే 10 కిలోమీటర్ల రహదారి, మామిడిపల్లి నుంచి బాగువలసకు వెళ్లే 8 కిలోమీటర్ల రహదారి, సాలూరు నుండి మక్కువ వెళ్లే 22 కిలోమీటర్ల రహదారి, ఎరగడవలస జంక్షన్ నుంచి మావుడికి వెళ్లే 4 కిలోమీటర్ల రహదారి, దండిగాం నుంచి నేరెళ్లవలస వెళ్లే 10 కిలోమీటర్ల రహదారిలో ప్రయాణించాలంటే విద్యార్థులు, ప్రయాణికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రతిరోజూ ఈ రహదారుల వెంట ప్రయాణించడానికి విద్యార్థులు, రైతులు, చిరు వ్యాపారులు, కూలీలు, ఉద్యోగులు వెళ్లాలంటే ఏ ప్రమాదం ఏ రూపంలో ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. దీనికితోడు పెద్దపెద్ద మలుపులు ఉండడంతో ఆ మలుపుల వద్ద ఈ గోతులు ఏర్పడడంతో ఎప్పుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సిన వస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు.

నిత్యం మండలంలోని ఈ ప్రాంతాల నుంచి ప్రజలు తమ అవసరాలు కోసం మామిడిపల్లి, మండల ప్రధాన కేంద్రమైన సాలూరు పట్టణానికి వెళ్లడానికి నానా ఇబ్బందులు పడుతూ రావాల్సి వస్తోందని, కొద్ది చీకటిపడ్డా ఈ రహదారిలో ప్రయాణమంటే అదో గండం గానే భావించాల్సి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ భయంతో ఎన్ని పనులు ఉన్నా వెలుతురు ఉన్నప్పుడే పనులు ముగించుకోవాల్సి వస్తోందని, సాయంత్రం 6 గంటలకు దాటితే ఈ రహదారుల వెంట ప్రయాణాలు చేయాలంటే ప్రాణాలు ఏ గాలిలోకి పోతాయోనన్న భయంతో ప్రయాణించాల్సి వస్తుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ ప్రాంతాలలో రహదారులను గుంతలు లేకుండా చేయాలని కోరుతున్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలి



నేను ట్రాక్టర్ నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాను. కురుకుట్టిలో జిసిసి డిపో నుంచి నేరెళ్ల వలస, మూలతాడివలస, దొర్లతాడి వలస, బంధపాయి గ్రామాలకు ప్రతినెలా నిత్యవసర సరుకులను అక్కడ ఉండే గిరిజనులు ట్రాక్టర్ ద్వారా తీసుకు పోవడానికి వస్తుంటాను. కానీ కురుకుట్టి నుండి దళాయివలస వెళ్లడానికి రోడ్డు అధ్వానంగా ఉండడంతో చాలా ఇబ్బందులు పడుతూ ప్రయాణాలు సాగిస్తున్నాను. ఈ రోడ్డును వెంటనే నిర్మించి, తమలాంటి చిన్న చిన్న పనులు చేసుకొనే వారికి ఉపయోగపడేలా కృషి చేయాలి.

చిన్నాపాత్రుని కొండలరావు, దళాయి వలస, కురుకుట్టి పంచాయతీ.

నడవడానికి ఇబ్బందే



మా గ్రామం నుంచి ప్రతిరోజూ మాకు అవసరమైన నిత్యవసర సరుకులను కొనుగోలు చేయడానికి మామిడిపల్లి రావాల్సి వస్తుంది. కనీసం ఈ రోడ్డులో ప్రభుత్వం బస్సు సౌకర్యం కనిపించలేదు కదా నడవడానికి కూడా చాలా ఇబ్బందులు పడుతూ ఈ రహదారులపై నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తుంది. చీకటి పడితే ఈ దారిలో ఏ గుంతలో పడి ఏమవుతుందోనన్న భయంతో వెళ్తరు ఉన్నప్పుడే నడుచుకుంటూ వెళ్లి సరుకులను కొనుగోలు చేయాల్సి వస్తుంది. గ్రామంలో ఎవరికైనా అత్యవసరమైన వైద్య చికిత్స కోసం ఏదైనా జరిగితే వెళ్లడానికి గ్రామాల్లోకి అంబులెన్సులు కూడా రావడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతానికి అంబులెన్స్‌లను రప్పించడానికి చాలా ఇబ్బందులు పడుతున్నాం. కావున రహదారుల నిర్మాణాల్ని చేపట్టి మా బాధలను తీర్చేలా కృషి చేయాలి.

చోడిపల్లి రామ, అంటివలస, అన్నంరాజువలస పంచాయతీ.



అధ్వాన్నంగా ఉన్న దండిగాం-నేరేళ్లవలస రోడ్డు

పట్టించుకునే నాధుడే కరువయ్యాడు



నేను నా గ్రామంలో చిన్న కిరాణా షాపును నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాను. ఎక్సెల్ బండిపై ప్రతిరోజు మామిడపల్లి, సాలూరు వెళ్లడానికి చాలా ఇబ్బందులు పడుతూ వెళ్లాల్సి వస్తుంది. ఎన్నిసార్లు సంబంధిత అధికారులకు తమ గ్రామంలో ఉన్న ప్రజలంతా ఫిర్యాదులు చేసినా కనీసం కన్నెత్తి చూడడం లేదు.

కొండగొర్రి అప్పలస్వామి, మడవలస, సారిక పంచాయతీ.

రీ సర్వేతో రైతులకు మేలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రభుత్వం చేపడుతున్న రీసర్వేతో భూ సమస్యలు తొలగి రైతులకు, భూ యజమానులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. రెండో విడత రీ సర్వే కార్యక్రమంలో భాగంగా మండలంలోని తాళ్లబురిడిలో నిర్వహిస్తున్న రీ సర్వే ప్రక్రియను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సర్వే జరిపే ముందు రైతులకు నోటీసులు జారీ చేసి గ్రామంలో రైతుల భూములతో పాటు గ్రామ సరిహద్దులు, నీటి వనరుల, పోరంబోకు భూములను కొలతలు వేసి ఖచ్చితమైన సరిహద్దులను ఏర్పాటు చేస్తారన్నారు. తద్వారా రైతులకు, భూ యజమానులకు శాశ్వత మేలు జరుగుతుందని పేర్కొన్నారు. రైతుల సమక్షంలోనే భూమి కొలతలు కొలిచి మీ భూమికి హద్దులు నిర్ణయిస్తారని తెలిపారు. రైతులతో ముఖాముఖి నిర్వహించి రీసర్వే జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వేలో తప్పులు దొర్లకుండా పక్కాగా నిర్వహించాలన్నారు. రైతులకు నోటీసులు జారీ చేస్తున్నదీ లేనిదీ రైతులను అడిగి ఆరా తీశారు. ఇప్పటి వరకు ఎంత మేర సర్వే నిర్వహించినట్లు తహశీల్దార్ వై.జయలక్ష్మిని ప్రశ్నించగా 1147 ఎకరాల గ్రౌండ్ ట్రూటింగ్ పూర్తి కాగా, మిగతా 31 ఎకరాలు సర్వే నిర్వహించాల్సి ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరణించిన భూ యజమానుల వారసులకు మార్పు చేసేలా ఎఫ్ఎంసి విచారణ పూర్తి చేసి మ్యూటేషన్లను పరిష్కరించాలని ఆదేశించారు. భూ సమస్యలు తలెత్తకూడదనేది రీసర్వే ఉద్దేశమని, రైతులు పక్కా భూ రిజిస్ట్రేషన్లు చేసుకొనేలా ప్రోత్సహించాలని సూచించారు. రోడ్లుకు కేటాయించిన భూముల్లో హద్దులు నిర్ణయించి రక్షణ కల్పించాలన్నారు. చెరువులు, వాగుల్లోని ఆక్రమణలు ఉంటే తొలగించాలని సూచించారు. సర్వే ప్రక్రియ జరిగిన తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్వే, భూ రికార్డుల నిర్వహణ శాఖ సహాయ సంచాలకులు లక్ష్మణ రావు, ఆర్ఐ జి.రవి తేజ, మండల సర్వేయర్ స్వామి, గ్రామ సర్వేయర్ నాయుడు, గ్రామ సచివాలయ సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

త్వరితగతిన పర్యాటకాభివృద్ధి పనులు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని తోటపల్లి, ఏనుగుకొండ, పెద్దగెడ్డ, వీరఘట్టం, కూర్మసాగరం ప్రాంతాలు బోటింగ్‌కు అనుకూలమని, కావున దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ఛాంబరులో అటవీ, పర్యాటక శాఖ కార్యకలాపాలపై సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు ప్రాంతాల్లో స్పీడ్ బోటింగ్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఒక్కో ప్రాంతంలో ఆరు నుంచి పది మంది ఆసక్తి కలిగిన గిరిజన యువతకు స్పీడ్ బోటింగ్‌పై శిక్షణ ఇప్పిస్తామని, కావున వారిని ఎంపికచేయాలని అన్నారు. బోటింగ్ నిర్వహణ ప్రైవేట్ సంస్థలు లేదా ఇతరులు నిర్వహించుకోవచ్చని కలెక్టర్ సూచించారు. బోటింగ్ ఏర్పాటుకు అవసరమైన అనుమతులు, మార్గ నిర్దేశాలు తదితర పనుల బాధ్యతను సంబంధిత అధికారులు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. నాణ్యత ప్రమాణాలు కలిగిన బోట్లను వినియోగించాలని, అందుకు తగిన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సీతంపేట మండలం పనుకుపేటలో గిరి గ్రామదర్శిని పనులు వీలైనంత త్వరగా ప్రారంభం కావాలన్నారు. గ్రామదర్శినిలో గిరిజన సంస్కృతి ప్రతిబింబించేలా మట్టితో నిర్మించిన గృహాలుండాలని, ఉత్తమ గృహానికి బహుమతిని ప్రకటిస్తామని తెలిపారు. గిరి గ్రామదర్శినిలోకి వెళ్లేందుకు ఆకర్షణీయమైన ప్రవేశ ద్వారం, గిరిజనులు వినియోగించే సామాగ్రి, వస్తువులతో ఆర్ట్ గ్యాలరీ ఉండాలని అన్నారు. థింసా నృత్యం, విక్రయ దుకాణాలు, కల్యాణమండపం వంటి ఏర్పాట్లు అందులో ఉండాలని, వచ్చే నెలలోగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అడలి వ్యూ పాయింట్ వద్ద వసతి గృహ నిర్మాణ పనులు ఆగస్టు నాటికి పూర్తికావాలని తేల్చి చెప్పారు. ప్రకృతి సోయగాలకు, పర్యావరణానికి అనుకూలమైన జగతిపల్లి రీసార్ట్ ప్రాంతాన్ని ప్రత్యామ్నాయ మార్గం ద్వారా అభివృద్ధి చేసేందుకు ఆలోచన చేయాలని సూచించారు. సీతంపేటలో మ్యూజియం, షికమరు వాటర్ ఫాల్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. జిల్లా అటవీ శాఖాధికారి సహకారంతో ఈ పనులన్ని నిర్దేశిత సమయంలోగా పూర్తిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, డిఎఫ్ఒ జిఎపి ప్రసూన, జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎల్.రమేష్, జిల్లా దేవాదాయ శాఖ అధికారి ఎస్.రాజారావు, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక సరఫరాకు రీచ్‌లు సిద్ధం

జిల్లాలోని భామిని మండలం నేరడి, పాలకొండ మండలం చినమంగళాపురం ఇసుక రీచుల నుంచి ఇసుక సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇసుక సరఫరాకు సంబంధించి కలెక్టర్ సంబంధిత అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ ఉత్తర్వులు, మార్గదర్శకాలకు అనుగుణంగా ఇసుక సరఫరా కావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇసుకను తరలించేందుకు వీలుగా స్టాక్‌పాయింట్లు సిద్ధంగా ఉండాలని, అక్రమ రవాణాకు తావులేకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, గట్టి పోలీసు బందోబస్తు, బారికేడ్లు, చెక్ పోస్టు, ఆన్‌లైన్ వే బిల్లు, రిజిష్టర్లు, రికార్డులు అన్ని పక్కాగా ఉండాలని అన్నారు. మొత్తం ప్రక్రియను పూర్తిచేసి ఇసుక సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించగా, అన్నీ సిద్ధమైనట్లు అధికారులు కలెక్టర్ కు వివరించారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, పాలకొండ సబ్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా గనులు, భూగర్భవనరుల శాఖాధికారి జి. జయప్రసాద్, పోలీస్, భామిని, పాలకొండ తహశీల్దారులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణ సంకటంగా ఆంధ్రా -కోరాపుట్ రోడ్డు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని మృత్యుంజయ నగరం (ఎమ్మార్ నగరం) రోడ్డు మృత్యు సంకటంగా మారిందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు వి.దాలినాయుడు, కోలా కిరణ్ కుమార్, తీళ్ళ గౌరీ శంకరరావు, సాలూరు నియోజకవర్గం ఇంచార్జ్ గేదెల రామకృష్ణ తదితరులు పార్వతీపురం పట్టణ సమీపాన గల వెంకంపేట ఘోరీల నుండి ఎమ్మార్ నగరం వరకు గల గోతులమయమైన రోడ్డును మంగళవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్వతీపురం నుండి కోరాపుట్ కు రాకపోకలు సాగించే ఈ రోడ్డంతా పెద్ద పెద్ద గోతులు ఏర్పడి ప్రాణ సంకటంగా మారిందన్నారు. ఈ గోతుల్లో పడిన వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయన్నారు. పలువురు ప్రయాణికులు ప్రమాదాలబారిన పడిన సంఘటనలు కోకొల్లలన్నారు. వైసిపి పాలనంతా రోడ్లు గోతులేనని, వాటిని బూచిగా ప్రజలకు చూపించి అధికారంలోకి వచ్చిన కూటమి పాలకులు సంక్రాంతిలోగా రోడ్డు మరమ్మతులు చేపడతామని ప్రజలకు హామీ ఇచ్చారన్నారు. సంక్రాంతి పోయినా రోడ్డు మరమ్మతులు మాత్రం జరగలేదన్నారు. కేవలం ప్రకటనలకు మాత్రమే పరిమితం అయిందని విమర్శించారు. ఈ రహదారిపై ప్రయాణించే స్థానిక ప్రజలతో పాటు ఒడిశాకు చెందిన ప్రజలు కూడా అధికారుల తీరుకు విస్మయం వ్యక్తం చేస్తున్నారన్నారు. తక్షణమే సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి వెంకంపేట గోరీల నుంచి ఎమ్మార్ నగరం వరకు గల గోతుల మయమైన రహదారి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.



గోతులమయమైన ఆంధ్రా-కోరాపుట్ రోడ్డును పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎస్‌సి కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు వాయిదా

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం జరగనున్న ఎస్సీ కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలను తాత్కాలిక వాయిదా వేసినట్లు ఎంపిడిఒ బిబి మిశ్రో ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి తేదీని త్వరలో ప్రకటిస్తామని, దీన్ని అభ్యర్థులు గమనించాలని కోరారు.

నేడు ఎంఎస్‌ఎంఇ పార్కుకు శంకుస్థాపన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పనుకువలస వద్ద ఎంఎస్ఎంఇ పార్కుకు బుధవారం శంకుస్థాపన జరుగుతుందని ఎపిఐఐసి జోనల్ మేనేజర్ ఎం.మురళీమోహన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 14న ఉదయం 10 గంటలకు శంకుస్థాపన జరుగుతుందని ఆయన తెలిపారు. మొదటి దశలో 27.26 ఎకరాలను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఈ ప్రాజెక్టుకు రూ.11.39 కోట్లు ఖర్చు జరుగుతుందని ఆయన వివరించారు.

సిఎంకు అభినందనలు

ప్రజాశక్తి - సీతంపేట

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ ప్రకారం స్పందించినందుకు ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ (ఎజెఎసి) తరుపున ధన్యవాదాలు తెలిపినట్లు ఛైర్మన్ కె.ధర్మారావు మీడియా సభ్యులు రామ్మోహన్ రావు ఒక ప్రకటన తెలిపారు. ఈ సందర్భంగా. ప్రభుత్వం వెంటనే "ట్రైబల్ అడ్వయిజరీ కౌన్సిల్" (టిఎసి)ని ఏర్పాటు చేసి షెడ్యూల్ ఏరియా ఉద్యోగ నియామకాలు చట్టం చేయాలని డిమాండ్ చేశారు. మెగా డీఎస్సీ-25 ప్రకటించిన ఏజెన్సీ పోస్టులను మినహాయించి షెడ్యూల్ ఏరియా ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తీసుకొనే నిర్ణయానికి ముందు ఆదివాసీల అభిప్రాయాలు తీసుకోవడానికి రాజ్యాంగ ప్రక్రియపైన అవగాహన కలిగిన "ఆంధ్ర ప్రదేశ్ ఆదివాస జెఎసి సభ్యులతో చర్చలు జరపాలని విజ్ఞప్తి చేశారు. ఈ డిమాండ్లను పరిష్కరించే వరకు శాంతియుతమైన ధర్మ పోరాటము కొనసాగించుతామని, దీనిలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఐటిడిఎల ముందు రిలే నిరాహారదీక్షలు చేపడతామని అన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

ప్రజాశక్తి - వేపాడ

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతూ మంగళవారం బల్లంకిలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ప్రచారం చేశారు. పాఠశాలలో విద్యార్థులు సంఖ్యను పెంచేందుకు గ్రామ పెద్దలను, తల్లిదం డ్రులను కలిశారు. ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పిస్తే నాణ్యమైన విద్యను అందిస్తామన్నారు.

అప్రెంటీస్ ఉద్యోగాలకు 30 మంది ఎంపిక

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక ప్రభుత్వ ఐటిఐ.కళాశాలలో మంగళవారం నిర్వహించిన అప్రెంటీస్ మేళాకు 30మంది ఎంపికైనట్లు ఐటిఐ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్, ప్లేస్‌మెంట్ అధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేళాకు 216 మంది విద్యార్థులు హాజరు కాగా అందులో అన్ రోల్ ఉద్యోగాలకు 50 మంది, అప్రెంటీష్ ఉద్యోగానికి 30 మంది ఎంపికైనట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాకు ఎంపికైన విద్యార్థులకు ప్రభుత్వ, ప్రవేటు కంపెనీల నుంచి రూ.13500 వరకు వేతనం చెల్లిస్తారని తెలిపారు. ప్రభుత్వం నుంచి నేరుగా రూ.1500, మొత్తం రూ.15వేలు వరకు అందజేస్తారన్నారు. అలాగే అప్రెంటీస్ విద్యార్ధులకు నెలకు స్టైఫండ్ రూపంలో చెల్లిస్తారు.



అభ్యర్థులనుద్దేశించి మాట్లాడుతున్న ప్లేస్‌మెంట్ అధికారి శ్రీనివాసరావు

అవయవ దానానికి అంగీకారం

ప్రజాశక్తి - చీపురుపల్లి

'మా ఈ దేహ సంపదను మా తదనంతరం మరికొన్ని ప్రాణాలను నిలబెట్టేందుకు ఇవ్వాలని' శివకు బంగారయ్య, రామలక్ష్మి దంపతులు చీపురుపల్లికి చెందిన మానవీయత స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షుడు బివి గోవిందరాజులుకి వారి స్వహస్తాలతో సంతకాలు చేసిన అంగీకార పత్రాలను అందజేశారు. నెల్లిమర్ల మండలం తంగుడుపల్లి ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సివుకు బంగారయ్య, విఆర్ఒగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న రామలక్ష్మి దంపతులు సామాజిక బాధ్యతగా గుర్తించి వారి తదనంతరం వారి శరీర భాగాలను దానం చేసేందుక అంగీకార పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవ జన్మ భగవంతుడు తమకు ఇచ్చిన గొప్ప వరం అని, ఈ అవకాశాన్ని సమాజ సేవలో సద్వినియోగం చేసుకునేందుకు ముందుకు వచ్చామని అన్నారు. తాము జీవించి ఉన్నంత వరకు ఈ శరీరాన్ని మంచి పని చేయడం కోసం ఒక సాధనంగా వాడుతామని తెలిపారు. శరీరం వదలాల్సిన స్థితి లోకంలో రాజుకైనా, పేదవానికైనా తప్పదని, ప్రాణాలు విడిచి వెళ్లేటప్పుడు తమ శరీర భాగాలు ఇతరులకు ఉపయోగపడేటట్లుగా అవయవ దానం చేసేందుకు సిద్ధపడ్డామన్నారు. తాము మరణిస్తూ ఇంకొకరికి కొత్త జీవితాన్ని అందిస్తే అంతకంటే గొప్పతనం ఏముంటదని చెప్పారు. అవయవ దానం ద్వారా తాము మరణిస్తూ మరెన్నో ప్రాణాలకు ఊపిరి పోయవచ్చుని, మరణం అంచున ఉండేవారికి కూడా జీవితాన్ని ప్రసాదించవచ్చుని వారు తెలిపారు.

సకాలంలో ప్రాథమిక చికిత్స అందించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

అత్యవసర పరిస్థితుల్లో ప్రాథమిక చికిత్స సకాలంలో అందించడం ద్వారా ప్రాణాపాయస్థితి నుండి తప్పించవచ్చని ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని పెదబొండపల్లి పిహెచ్‌సిని మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రిలో వినియోగించే పరికరాలు,కిట్లు పరిశీలించి,వాటి పనితీరును గమనించారు.అత్యవసర సమయంలో ప్రాథమిక వైద్యానికి అందుబాటులో ఉన్న పరికరాలు, నిర్వహణ తీరు పరిశీలించారు.. ఆక్సిజన్ కాన్సంట్రేటర్, సిలిండర్,ఆక్సీజన్ ఫ్లో మీటర్, అంబు బ్యాగ్, ఈసిజీ యంత్రం,బిపి పరికరం, సిబిసి,యూరిన్ అలైజర్స్, వీల్ చైర్,స్ట్రెచర్,అగ్నిమాపక యంత్రం, బ్యాటరీ బ్యాక్ అప్, కోల్డ్ చైన్ సిస్టమ్, అత్యవసర ఇంజెక్షన్లు మొదలగు వాటిని పరిశీలించారు. వీటి పని తీరును ఎప్పటికపుడు గమనించాలని,ఏదైనా సాంకేతిక,యాంత్రిక సమస్య వస్తే వెంటనే పరిష్కరించాలని సూచించారు. అత్యవసర సమయంలో ఆరోగ్య కేంద్రాల్లో ప్రాథమిక చికిత్స సిద్ధంగా ఉండాలన్నారు.